
ఆంధ్రజ్యోతి

andhrajyothy.com

శుక్రవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 28.5 : కనిష్ఠం 18.6



కామారెడ్డి

జిల్లా వార్తలు

5

శనివారం 28 డిసెంబరు 2024



కామారెడ్డిలో ఉన్న పోలీసు స్టేషన్

ఒకే ఒక్కటి!

- జిల్లా కేంద్రంగా ఏర్పడినా పెరగని ఠాణాలు
- లక్ష జనాభా దాటినా ఒక్కటే పోలీస్ స్టేషన్
- ఉన్న సిబ్బందికే ట్రాఫిక్ విధులు
- ఆందోళనకు గురి చేస్తున్న నేరాలు, వరుస చోరీలు
- పట్టణ, శివారు ప్రాంతాల్లో ప్రశ్నార్థకంగా భద్రత
- అదనంగా మరో పోలీసు స్టేషన్, ట్రాఫిక్ పోలీసుస్టేషన్ అవసరం
- వీటి కోసం ఆరేళ్ల కిందటే ప్రతిపాదించినా పట్టించుకోని ప్రభుత్వాలు

కామారెడ్డి టౌన్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా కేంద్రం జాతీయ రహదారికి అనుకొని ఉండడంతో పాటు రోజు రోజుకూ విస్తరిస్తోంది. చుట్టుపక్కల మండలాలు, గ్రామాల నుంచి కామారెడ్డికి వచ్చి స్థిరపడుతున్నారు. ఇప్పటికే లక్షకు పైగా జనాభా దాటినప్పటికీ పట్టణంలో ఒకే ఒక్క పోలీసుస్టేషన్ ఉండడంతో శాంతి భద్రతల పర్యవేక్షణ పోలీసులకు సవాల్‌గా మారుతోంది. జిల్లా పోలీసులు నూతన టెక్నాలజీని వాడుతూ దొంగతనాలను, నేరాలను అరికట్టేందుకు ప్రయత్నిస్తున్నప్పటికీ హత్యలు, ఆత్మహత్యలు, దొంగతనాలు జరుగుతునే ఉన్నాయి. దొంగల ముఠా ఏదో ఒక రూపంలో వస్తూ తరచూ చోరీలకు పాల్పడుతుండడంతో పట్టణ వాసులను ఆందోళనకు గురి చేస్తోంది. కామారెడ్డి పట్టణంలోని ఒకే పోలీసుస్టేషన్‌లో ఉన్న సిబ్బందే అన్ని బాధ్యతలను తీసుకోవాల్సి వస్తుండడంతో నేరాలను నియంత్రించడంలో దృష్టి సారించలేక పోతున్నారు. కామారెడ్డి జిల్లా కేంద్రంగా ఏర్పడిన తర్వాత అదనంగా మరో పోలీస్ స్టేషన్, ట్రాఫిక్ పోలీసుస్టేషన్‌ను ఏర్పాటు చేయాలని జిల్లా పోలీసుశాఖతో పాటు ప్రజాప్రతినిధులు గత ఆరేళ్ల కిందనే ప్రభుత్వానికి, రాష్ట్ర హోం శాఖకు ప్రతిపాదించిన ఎలాంటి చర్యలు లేక పోవడంతో ఉన్న పోలీసుస్టేషన్ సిబ్బందిపైనే అదనపు భారం పడుతోంది.

ప్రశ్నార్థకంగా మారుతున్న భద్రత

కామారెడ్డి పట్టణంతో పాటు శివారు ప్రాంతాల్లో శాంతి భద్రతల పర్యవేక్షణ ప్రశ్నార్థకంగా మారుతోంది. పట్టణంలో తరచూ చోటు చేసుకుంటున్న హత్యలు, ఆత్మహత్యలు, గొడవలు వీటికి తోడు దొంగతనాలు ప్రజలను ఆందోళనకు గురి చేస్తున్నాయి. దీంతో జనం భయం నీడన బతకాల్సి వస్తోంది. నేరాల నియంత్రణకు పోలీసు యంత్రాంగం చర్యలు తీసుకుంటున్నా ఏదో ఒక్క నేర సంఘటన జరుగుతుంది. ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఎస్ఐ, మహిళా కానిస్టేబుల్, యువకుడి మూకుమ్మడి ఆత్మహత్య సంఘటన లాంటివి జరగకుండా చూడాలంటే మరింత నిఘా అవసరం. అదేవిధంగా రైల్వే, జాతీయ రహదారులు పట్టణానికి ఆనుకొని ఉండడంతో అంతర్రాష్ట్రాలకు చెందిన దొంగలు అలజడి ఎక్కువగా ఉండడంతో పోలీసులకు ఇబ్బందిగా మారుతోంది. ఈ మధ్యకాలంలో పట్టణంతో పాటు పట్టణ శివారుల్లో ఏదో ఒకచోట హత్యలు చోటు చేసుకుంటునే ఉన్నాయి. అదేవిధంగా రోడ్డు ప్రమాదాలు సైతం జరుగుతున్నాయి.

ఒక్కటే పోలీసుస్టేషన్

కామారెడ్డి పట్టణ జనాభా లక్ష దాటిపోయింది. పట్టణానికి నిత్యం వేలాది మంది ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. జిల్లా కేంద్రంలో రైలు పట్టాలకు రెండు వైపులా పట్టణం ఉండడం వల్ల పాత పట్టణానికి ఒక్క పోలీసుస్టేషన్, కొత్త పట్టణానికి మరో పోలీసుస్టేషన్ అవసరం అవుతోంది. పట్టణంలోని కిష్టమ్మగుడి ప్రాంతంలో అవుట్ పోస్ట్ ఉంది. పట్టణంలో సమస్యాత్మక ప్రాంతాలు ఎన్నో ఉన్నాయి. రాజకీయ పార్టీలు పోటాపోటీగా కార్యక్రమాలు నిర్వహిస్తుంటాయి. అధికార పార్టీకి పోటీగా ప్రతిపక్ష పార్టీలు చురుకుగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. దీంతో అప్పుడప్పుడు రాజకీయ పార్టీల మధ్య వివాదాలు, ఘర్షణలు జరుగుతునే ఉంటాయి. దానికి తోడు వివిధ మతాలకు చెందిన పండుగలు నిర్వయిస్తుంటారు. గణేష్ ఉత్సవాలు, దుర్గమాత నవరాత్రి ఉత్సవాలు, శ్రీరామ నవమి ఉత్సవాలు, హనుమాన్ జయంతి ర్యాలీలు పెద్దఎత్తున జరుగుతాయి. పండుగల సమయంలో పోలీసు యంత్రాంగం పకడ్బందీ చర్యలు చేపట్టాల్సి ఉంటుంది. వీఐపీల పర్యటనలు కూడా ఉంటాయి వారి బందోబస్తు పోలీసు లకు అదనపు భారం. దీనికి తోడు పట్టణంలో తరచూ దొంగతనాలు పోలీసులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. పట్టణంలో ఎక్కడో ఒక్కచోట తాళం వేసిన ఇళ్లను టార్గెట్ చేసుకొని దోచుకొని వెళ్తుండడం, హత్యలు, చైన్ స్నాచింగ్‌లు, రాత్రిపూట గొడవలు చోటు చేసుకుంటున్నాయి. రాజకీయ కక్షలు, పాత కక్షలతో దాడులు, ప్రతీ దాడులు జరుగుతునే ఉంటాయి. ఇంత ఒత్తిడి ఉన్నా పట్టణంలో సరిపడా పోలీసు స్టేషన్‌లు లేకపోవడం ఇబ్బందికరంగా ఉంటుంది.

ట్రాఫిక్ కష్టాలు అంతా ఇంత కాదు

జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ కష్టాలు ప్రజలకే కాకుండా పోలీసులకు సైతం ఇబ్బందులు పెడుతున్నాయి. పట్టణంలో ఏదో ఒక్క చోట నిత్యం ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతుంటాయి. కామారెడ్డి పట్టణానికి నిత్యం ఆయా జిల్లాల నుంచి సుమారు 50వేల వరకు ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. అటు బస్సులు ఇటు రైలు, ప్రైవేట్ వాహనాల్లో వేలాది మంది వచ్చి వెళ్తుంటారు. జిల్లాగా ఏర్పాటైన తర్వాత వాహనాల రద్దీ మరీ ఎక్కువైంది. పట్టణంలో నిజాంసాగర్ చౌరస్తా, కొత్త బస్టాండ్, రైల్వే కమాన్, రైల్వేస్టేషన్ వద్ద గల ఇందిరాగాంధి చౌరస్తా, తిలక్‌రోడ్డు, జేపీఎన్ రోడ్డు, సుభాష్ రోడ్డు, రామారెడ్డి రోడ్లలో ట్రాఫిక్ ఇబ్బందులు ఉన్నాయి. ట్రాఫిక్ పోలీసుస్టేషన్ లేక పోవడంతో పట్టణ పోలీసులే ట్రాఫిక్ విధులు కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం పట్టణంలో ట్రాఫిక్ పోలీసు స్టేషన్ చాలా అవసరమని పోలీసు అధికారులు సైతం పేర్కొంటున్నారు.


మన్మోహన్ సింగ్ చిత్ర పటం వద్ద నివాళ్లు అర్పిస్తున్న షబ్బీర్‌అలీ, నాయకులు

ఆర్థిక సంస్కర్త మాజీ ప్రధాని మన్మోహన్

- ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ

కామారెడ్డి టౌన్, డిసెంబరు 27: ఆర్థిక సంస్కర్త మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ అని ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ అన్నారు. శుక్రవారం ఆయన కామారెడ్డిలోని పార్టీ కార్యాలయంలో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ చిత్రపటం వద్ద నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన్మోహన్ సింగ్ మరణం దేశానికి తీరని లోటని అన్నారు. అనేక దేశాలను ఆర్థిక సంక్షోభం నుంచి బయట పడేశాడని, 10 సంవత్సరాలు దేశ ప్రధానిగా పని చేసి అనేక సంస్కరణలకు పెద్దపీట వేశారని అన్నారు. ప్రధానిగా నెహ్రూ, ఇందిరాగాంధీ, నరేంద్రమోదీ తర్వాత ఎక్కువ కాలం పని చేసిన ప్రధానిగా ఆయన కీర్తి గడించారని తెలిపారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో సోనియాగాంధీతో పాటు సమాన హక్కు మన్మోహన్ సింగ్‌దని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ, గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మన్మోహన్ సింగ్ మరణం దేశానికి తీరని లోటు

- ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మరణం చాలా బాధాకరమని ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దేశం గొప్ప ఆర్థిక సంస్కర్తను కోల్పోయిందని, మన్మోహన్ సింగ్ మరణం తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని ఆయన అన్నారు. మన్మోహన్‌సింగ్ దేశానికి అవిశ్రాంతంగా సేవలందించారని కొనియాడారు. ఆయన మృతి దేశానికి తీరని లోటన్నారు. దూరదృష్టితో సంస్కరణలు తీసుకువచ్చారని ఉపాధి హామీ, ఆధార్, ఆర్‌టీఐ, విద్యాహక్కు చట్టం తీసుకొచ్చారని తెలిపారు. అనేక పదవులను మన్మోహన్‌సింగ్ సమర్థవంతంగా నిర్వహించారని అన్నారు. ఆయన సేవలు చిరస్మరణీయమని వివరించారు.


కలెక్టర్‌ను కలిసి పూలబొకేను అందిస్తున్న గృహ నిర్మాణ శాఖ పీడీ

కలెక్టర్‌ను కలిసిన గృహ నిర్మాణశాఖ పీడీ

కామారెడ్డి టౌన్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా పొ.విజయ్‌పాల్‌రెడ్డిని ప్రభుత్వం నియమించింది. శుక్రవారం ఆయన కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూలబొకేను అందించారు. గతంలో హైదరాబాద్‌లోని రాజీవ్ స్వగృహలో పని చేసిన విజయ్‌పాల్‌రెడ్డి బదిలీపై కామారెడ్డికి వచ్చారు.

మూకుమ్మడి ఆత్మహత్యలపై రాష్ట్ర పోలీసుశాఖ సీరియస్

- ఎస్ఐ, మహిళా కానిస్టేబుల్ మృతిపై పోలీసు ఉన్నతాధికారుల ఆరా
- కేసు దర్యాప్తును ముమ్మరం చేసిన జిల్లా పోలీసులు
- విచారణను స్వయంగా పర్యవేక్షిస్తున్న ఎస్పీ
- మూడు దర్యాప్తు టీంలను ఏర్పాటు చేసినట్లు సమాచారం
- ఇప్పటికే మృతుల కాల్‌డేటా, వాట్సాప్ చాటింగ్ సేకరించిన టీంలు
- సీసీ పుటేజీలను జల్లెడ పడుతున్న పోలీసులు
- ఇంత జరుగుతున్నా నిఘా విభాగాలు ఏం చేస్తున్నట్లు?

కామారెడ్డి, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన కామారెడ్డి మూకుమ్మడి ఆత్మహత్యల్లో మృతులుగా ఎస్ఐ, మహిళా కానిస్టేబుల్ ఉండడంపై రాష్ట్ర పోలీసుశాఖ సీరియస్ అయినట్లు తెలిసింది. ఎస్ఐ, కానిస్టేబుల్ ఆత్మహత్య చేసుకునేంత పరిస్థితి వచ్చేదాక జిల్లా పోలీసులు ఏం చేస్తున్నారని పోలీసు ఉన్నతాధికారులు ప్రశ్నించినట్లు సమాచారం. వీరి మధ్య ఉన్న సంబంధాలపై పోలీసుశాఖలో చర్చ సాగినప్పటికీ ఎందుకు నిఘా పెట్టలేకపోయారని నిలదీసినట్లు తెలిసింది. ఈ ఘటనపై పోలీసు ఉన్నతాధికారులు జిల్లా అధికారులను ఆరా తీసినట్లు సమాచారం. ఈ ఘటనపై సమగ్ర విచారణను జరిపి పూర్తి నివేదికను సమర్పించాలని జిల్లా ఎస్పీ సింధూశర్మకు రాష్ట్ర పోలీసుశాఖ ఆదేశించినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో మూకుమ్మడి ఆత్మహత్యల కేసును జిల్లా ఎస్పీ స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. ఈ కేసు విచారణ జిల్లా పోలీసుశాఖ ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా కేసు విచారణను చేపట్టేందుకు జిల్లా ఎస్పీ మూడు టీంలను ఏర్పాటు చేసినట్లు సమాచారం. ఈ టీంలు ఇప్పటికే రంగంలోకి దిగి ఆత్మహత్యకు గల కారణాలను తెలుసుకునేందుకు విచారణ చేపడుతున్నారు. మృతుల్లో ఎవరు కూడా బతికి బయటపడకపోవడంతో ఈ కేసు విచారణ పోలీసులకు సవాళ్లగా మారింది. కాల్‌డేటా, వాట్సాప్ చాటింగ్, సీసీ పుటేజీలే కీలకం కానున్నాయి. అదేవిధంగా పోస్టుమార్టం రిపోర్టు సైతం విచారణకు ప్రాధాన్యం కానుంది. వీటి ఆధారంగా విచారణ చేపడుతున్నారు.

కేసు దర్యాప్తు ముమ్మరం

సదాశివనగర్ మండలం అడ్లూర్ ఎల్లారెడ్డి చెరువులో దూకి మూకుమ్మడి ఆత్మహత్యలకు పాల్పడి మృతిచెందిన ఎస్ఐ సాయికుమార్, మహిళా కానిస్టేబుల్ శృతి, కంప్యూటర్ ఆపరేటర్ నిఖిల్ కేసు దర్యాప్తును జిల్లా పోలీసుశాఖ ముమ్మరం చేసింది. ఈ కేసును నేరుగా ఎస్పీ సింధూశర్మనే పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటికే ఎల్లారెడ్డి డీఎస్పీ నేతృత్వంలో సదాశివనగర్ సీఐ సంతోష్ ఆధ్వర్యంలో దర్యాప్తు కొనసాగుతుండగా తాజాగా ఈ కేసు దర్యాప్తు మరింత వేగవంతం చేసేందుకు ప్రత్యేకంగా ఇద్దరు సీఐలతో కూడిన రెండు టీంలను ఏర్పాటు చేశారు. ఒక్క టీం మృతుల సెల్‌ఫోన్‌ల కాల్‌డేటా వివరాలను సేకరించడంతో పాటు వీరు వాట్సాప్ చాటింగ్ చేసిన వాటిని బయటకు తీస్తున్నారు. అయితే శృతి, నిఖిల్ ఇద్దరి వాట్సాప్‌లో గత రెండు రోజులుగా పలు అంశాలపై చాటింగ్ చేసినట్లు తెలిసింది. ఇందులో ఆత్మహత్యకు సంబంధించి చాటింగ్ ఉన్నట్లు పోలీసులు గుర్తించినట్లు సమాచారం. ఇదిలా ఉండగా మరో దర్యాప్తు బృందం సీసీ కెమెరాల పుటేజీలను జల్లెడ పడుతున్నారు. మృతులు ఎక్కడెక్కడికి వెళ్లారు. అడ్లూర్ ఎల్లారెడ్డి చెరువు వద్దకు ఏ సమయంలో వెళ్లారని ఆ మార్గాల్లో సీసీ పుటేజీలను సేకరించారు. వీటి ఆధారంగా దర్యాప్తు చేపడుతున్నారు. అదేవిధంగామృతుల కుటుంబ సభ్యులను సైతం రేపోమాపో విచారించనున్నారు. వీరు ముగ్గురికి ఉన్న సంబంధాలపై కుటుంబీకులకు ముందే తెలిసి ఉంటుందా అనే దానిపై పోలీసులు ఆరా తీస్తున్నారు. మృతుల పోస్టుమార్టం రిపోర్టులోను చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు తేలినట్లు సమాచారం. వీరి చెరువులో మునిగిపోవడంతో కడుపులో, ఛాతిలో నీరు చేరడంతోనే మృతి చెందినట్లు పోస్టుమార్టం రిపోర్టు వచ్చినట్లు తెలిసింది. అయితే శృతి, సాయికుమార్‌ల మృతదేహాల ముఖాలపై గాయాలు ఉండడంతో హత్యలా.. ఆత్మహత్యలా అనే దానిపై కుటుంబీకుల నుంచి అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అయితే అవి చెరువులో దూకినప్పుడు ముఖంపై దెబ్బలు తాకి ఉండవచ్చని మొదటి నుంచి పోలీసులు భావిస్తున్నప్పటికీ పోస్టుమార్టంలో కూడా ప్రమాదవశాత్తు తగిలిన దెబ్బలేనని వచ్చినట్లు సమాచారం.

పెళ్లి వ్యవహారమే ఆత్మహత్యలకు దారి తీసిందా?

ముగ్గురి ఆత్మహత్యలకు గల కారణం ఇప్పటికీ తెలియరాలేదు. పోలీసులు ఓ వైపు దర్యాప్తు చేస్తున్నప్పటికీ వీరి ఆత్మహత్యలకు కారణం ఏంటనే దానిపై లోతుగా విచారణ చేపడుతున్నారు. పెండ్లి వ్యవహారమే వీరి ఆత్మహత్యలకు కారణమని బీబీపేట, గాంధారి, భిక్కనూరులో ప్రచారం సాగుతోంది. మహిళా కానిస్టేబుల్ శృతి రెండేళ్ల కిందట కామారెడ్డి నుంచి బదిలీపై బీబీపేట పోలీసుస్టేషన్‌కు వెళ్లింది. పోలీసు స్టేషన్‌లో రిసెప్షన్‌గా శృతి విధులు నిర్వహిస్తోంది. అయితే స్టేషన్‌లోని కంప్యూటర్‌లో ఏదైన సాంకేతిక సమస్య వస్తే కంప్యూటర్ ఆపరేటర్ నిఖిల్ సరి చేసేవాడని ఇదేక్రమంలో వీరిద్దరి మధ్య పరిచయం కాస్త సన్నిహితంగా మారింది. అప్పటి నుంచే వీరు ప్రేమ వ్యవహారంలో ఉన్నట్లు బీబీపేటలో ప్రచారం సాగుతోంది. పోలీసుస్టేషన్‌లోని కంప్యూటర్‌లో సమస్య వస్తే అప్పుడప్పుడు శృతి నిఖిల్‌ను పిలిపించేదని పోలీసుస్టేషన్ సిబ్బంది సైతం చెబుతున్నారు. అయితే వీరు ప్రేమలో ఉండగానే ఎస్ఐ సాయికుమార్‌కు శృతిల మధ్య సాన్నిహిత్యం పెరిగింది. అప్పటికే శృతి, నిఖిల్‌లు పెళ్లి చేసుకుందామని నిర్ణయించుకున్నట్లు సమాచారం. అయితే ఎస్ఐ, మహిళా కానిస్టేబుల్ మధ్య సాన్నిహిత్యం ఉన్నట్లు నిఖిల్‌కు తెలియడంతో వీరి మధ్య విభేదాలు వచ్చినట్లు తెలుస్తోంది. ఇదే క్రమంలో శృతి, నిఖిల్‌ను పెండ్లి చేసుకోవాలని ఒత్తిడి చేసినట్లు సమాచారం. దీంతో గత కొన్ని రోజులుగా వీరి ముగ్గురి మధ్య తగదాలు చోటు చేసుకుంటూ వచ్చాయి. ఈ విషయం ఎస్ఐ కుటుంబీకులకు సైతం తెలిసింది. ఎస్ఐ ఒత్తిడికి గురైనట్లు సమాచారం. ముగ్గురు కలిసి సమస్యను పరిష్కరించుకుందామని అనుకొని అడ్లూర్ ఎల్లారెడ్డి చెరువుకు వెళ్లి మాట్లాడుకునే ప్రయత్నం చేయగా అదికాస్త గొడవగా మారి ఆత్మహత్యకు దారి తీసినట్లు పోలీసులు ఓ నిర్ధారణకు వచ్చినట్లు తెలుస్తోంది. అయితే దీనిపై పోలీసులు వివరాలు వెల్లడిస్తేనే స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

ఇంత జరుగుతున్నా నిఘా విభాగాలు ఏం చేస్తున్నట్లు?

నిత్యం చిన్నపాటి ధర్నాలు, ర్యాలీలు, ఆందోళనలు, గొడవలు జరిగినా లేదంటే జరిగేందుకు ఆస్కారం ఉన్నా ఎప్పటికప్పుడు అలర్ట్‌గా ఉంటూ ముందస్తుగా పోలీసుశాఖ ఉన్నతాధికారులకు సమాచారం చేరవేసే నిఘా విభాగాలు సొంతశాఖలోని పలువురు ఎస్ఐలు, సిబ్బందిపై మాత్రం నిఘా పెట్టడం లేదని తెలుస్తోంది. ఎస్ఐ, కానిస్టేబుల్, కంప్యూటర్ ఆపరేటర్‌కు ఉన్న సంబంధాలపై బీబీపేట మండలంలో కోడై కూస్తున్న ముందుగానే పోలీసు నిఘా వర్గాలు ఎందుకు గుర్తించలేదనే దానిపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. వీరి వ్యవహారంపై పోలీసుశాఖలోని కొందరికి తెలిసినప్పటికీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లకపోవడంపై గల కారణం ఏంటని పోలీసుశాఖలోనే చర్చ సాగుతోంది.

నేడు సిద్ధరామేశ్వర ఆలయ హుండీ లెక్కింపు

భిక్కనూరు, డిసెంబరు 27: మండల కేంద్రంలోని శ్రీ సిద్ధరామేశ్వర ఆలయ హుండీని శనివారం లెక్కించనున్నట్లు ఆలయ ఈవో శ్రీధర్ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని ఉదయం 9 గంటలకు స్వామి వారికి ప్రత్యేక పూజల అనంతరం ప్రారంభించడం జరుగుతుందన్నారు.

పూల వ్యాపారి మృతదేహం లభ్యం

నందిపేట, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కమ్మర్‌పల్లి మండల కేంద్రంలో పూల వ్యాపారం చేసుకునే దొండి గంగామోహన్(45) ఈనెల 25న మధ్యాహ్నం 2 గంటల కనిపించకుండా పోయాడు. రాత్రి ఆరా తీసిన కుటుంబసభ్యులు కమ్మర్ పల్లి పోలీస్‌స్టేషన్‌లో అదృశ్యం కేసు నమోదు చేశారు. కాగా శుక్రవారం సాయంత్రం ఉప్లూర్ రోడ్‌లో ఇందిరమ్మ వరద కాలువలో మృతదేహమై తేలాడు. ఈ మృతదేహం గంగామోహన్‌ది అని కుటుంబ సభ్యులు గుర్తించడంతో మృతదేహాన్ని కాలువ నుంచి బయటకు తీసి పంచనామా అనంతరం పోస్టుమార్టం కోసం ఆర్మూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు కమ్మర్‌పల్లి ఎస్సై అనిల్‌రెడ్డి తెలిపారు. మృతునికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. మరణా నికి గల కారణాలు తెలియరాలేదని ఎస్సై తెలిపారు.

అప్పుల బాధ భరించలేక వ్యక్తి ఆత్మహత్య

మాక్లూర్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మాక్లూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని చిక్లి గ్రామానికి చెందిన మహేందర్ (50) అనే వ్యక్తి అప్పుల బాధ భరించలేక శుక్రవారం గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్టు గ్రామస్థులు తెలిపారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఆర్మూర్‌టౌన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో శుక్రవారం అంకాపూర్ గ్రామానికి చెందిన నాగేంద్ర(21) చికిత్స పొందుతూ మృతి చెందినట్టు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నెల్లూర్ జిల్లాకు చెందిన నాగేంద్ర గత కొన్నేళ్లుగా అంకాపూర్ గ్రామంలో నివసిస్తూ జీవనం గడుపుతున్నారని, అనారోగ్య కారణాలతో గత శనివారం గుర్తుతెలియని పురుగుల మందు తాగగా జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందగా కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

నవీపేటలో లారీ బోల్తా


నవీపేటలో బోల్తా పడిన లారీ

నవీపేట,డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రైల్వే గేటు సమీపంలో శుక్రవారం ఉదయం లారీ బోల్తా పడింది. నిజామాబాద్ వైపు నుండి బాసర వైపు లారీ వెళ్తుండగా రైలు పట్టాల మరమ్మతులలో భాగంగా నవీపేటలోని ప్రధాన రైల్వేగేటు మూసి ఉన్న విషయం విధితమే. ఈ విషయం తెలియని లారీ డ్రైవర్ రైల్వేగేటు సమీపంలో తాత్కాలికంగా వేసిన రోడ్డును చూసి అందులో నుండి లారీని నడపడానికి యత్నించడంతో అదుపు తప్పి బోల్తా పడిందని స్థానికులు తెలిపారు.ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్, క్లీనర్‌లకు స్వల్ప గాయాలయ్యాయని, లారీలో పత్తి లోడ్ ఉందని స్థానికులు వివరించారు.

ట్రాక్టర్ బోల్తా పడి వ్యక్తి మృతి


ఘటనా స్థలాన్ని పరిశీలస్తున్న ఎస్సై (ఇన్‌సెట్‌లో) బోల్తాపడ్డ కారు

ఆర్మూర్‌టౌన్, డిసెంబరు 27 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని మిర్దాపల్లి గ్రామ మూలమలుపు వద్ద ట్రాక్టర్ బోల్తా పడి లక్ష్మయ్య(25) అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఇస్సాపల్లి గ్రామంలో ట్రాక్టర్ లో ఇటుకలను నింపుకొని ఆలూర్‌కు వెళ్తుం డగా మిర్దాపల్లి శివారులోని మూలమలుపు వద్ద ట్రాక్టర్ బోల్తా పడడంతో ముగ్గురికి గా యాలు కాగా లక్ష్మయ్యపై ఇటుకలు పడడంతో అక్కడికక్కడే మృతి చెందారు. దీంతో సంఘటన స్థలాన్ని ఎస్సై మహేష్ పరిశీలించి మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో కిరాణషాప్ దగ్ధం

● రూ.2లక్షల ఆస్తినష్టం


అయిలాపూర్‌లో దగ్ధమైన కిరాణషాప్

నందిపేట, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అయిలా పూర్ గ్రామంలో గురువారం రాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో కిరాణషాప్ పూర్తిగా దగ్ధమైంది. పెంకుటిళ్లలో ఉన్న కిరాణషాప్‌లో ఫ్రిజ్‌తో షార్ట్‌సర్క్యూట్ ఏర్పడడం, మంటలు ఎగిసిపడి పెంకుటిళ్లకు ఉన్న దులాలు (కట్టెలు, కర్రలు) పూర్తిగా కాలిపోయాయి. దీంతో కిరాణ షాప్‌లో కిట్‌లు, నిత్యవసర సరుకులు, నగదు పూర్తిగా కాలిపోయాయి. మంటలు ఎగిసి పడడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. హుటాహుటిన చేరు కున్న పోలీసులు ఫైరింజన్‌కు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి మంటలను ఆర్పివేశారు. సుమారు రూ2లక్షల వరకు ఆస్తినష్టం జరిగిందని బాధితులు తెలిపారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

సాలూర, డిసెంబరు27 (ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణానికి చెందిన ఆరుగొండ మహేష్ (50) అనే వ్యక్తి సాలూర గ్రామ శివారులో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు బోధన్ రూరల్ ఎస్ఐ మచ్చేందర్ రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మృతుడు ఆరుగొండ మహేష్ గత కొంతకాలంగా విపరీతమైన కడుపు నొప్పితో బాధపడుతున్నారని, నొప్పి భరించలేక గురువారం అర్ధరాత్రి సాలూర గ్రామ శివారులో చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. మృతుడి భార్య ఆరుగొండ మౌనిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని అన్ని కోణాల్లో దర్యాప్తు జరుపుతున్నామన్నారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామన్నారు.

సాలంపాండ్ గ్రామంలో చోరీ

సాలూర, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సాలంపాడ్ గ్రామానికి చెందిన నర్సారెడ్డి ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తి ఇంటి తాళాలు పగులగొట్టి చోరీ చేశారని బోధన్ రూరల్ ఎస్సై మచ్చేందర్ రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం బాధిత కుటుంబీకులు బంధువుల ఇంటికి ఈ నెల 21వ తేదీన హైదరాబాద్ వెళ్లారన్నారు. గురువారం సాయంత్రం ఇంటికి వచ్చి చూడగా ఇంటి తాళం పగులగొట్టి ఇంట్లో ఉన్న విలువైన వస్తువులతో పాటు రెండు తులాల బంగారం, నాలుగు తులాల వెండి, 25వేల నగదు ఎత్తుకెళ్లినట్లు బాధిత కుటుంబ సభ్యులు ఫిర్యాదులో పేర్కొన్నారన్నారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో విచారణ చేపడుతున్నామన్నారు. సీసీ పుటేజీల ద్వారా అన్ని కోణాల్లో విచారణ చేపట్టి త్వరలోనే దొంగలను పట్టుకుంటామన్నారు.

నేడు విజయసాయిలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

బోధన్‌రూరల్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలోని శ్రీ విజయ సాయి ఉన్నత పాఠశాలలో నేడు పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు పూర్వ విద్యార్థులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విజయ సాయి విద్యాసంస్థల వ్యవస్థాపకుడు కామశాస్త్రి రానున్నట్లు పూర్వ విద్యార్థులు తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కృష్ణ మోహన్, మేనేజర్ ఐఆర్ చక్రవర్తి కామశాస్త్రికి ప్రత్యేకంగా సన్మాన కార్యక్రమాలు చేపట్టనున్నారు.

మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు ఘన నివాళి


కోటగిరిలో మాజీ ప్రధాని చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న దృశ్యం


బోధన్‌లో ..



మెండోరలో

కోటగిరి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పోతంగల్ మండల కేంద్రంలో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి పట్ల పలువురు సంతాపం వ్యక్తం చేశారు. మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ దేశ ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టిన ఘనత మన్మోహన్ సింగ్‌కే దక్కుతుందని పేర్కొన్నారు. దేశానికి ఏనలేని సేవలు చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ హన్మంతు, నాయకులు వర్ని శంకర్, మన్సూర్, చాంద్ పాషా తదితరులు పాల్గొన్నారు.

● కోటగిరిలో..

మాజీ ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్ మృతి పట్ల మండల కాంగ్రెస్ నాయకులు సంతాపం ప్రకటించారు. కోటగిరి మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద శుక్రవారం మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. రెండు నిమిషాలు మౌనం పాటించి దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు.ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ హన్మంతు, నాయకులు షాహీద్, మనోహర్, హైమద్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

దేశానికి తీరని లోటు

బోధన్‌రూరల్: మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి దేశానికి తీరని లోటని టీపీసీసీ అధ్యక్షులు గంగాశంకర్ అన్నారు. శుక్రవారం బోధన్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, మధ్య తరగతి ప్రజల కోసం సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిన ఘనత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌దేనని ఈ రోజు ఆయన మధ్య లేకపోవడం చాలా బాధకరమన్నారు. పేద ప్రజల సౌకర్యార్థం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం వంటి ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారని కొనియాడారు. దేశాన్ని తీవ్రమైన ఆర్థిక ఇబ్బందుల నుండి గట్టెక్కించిన మహ ఆర్థిక మేధావి అని కొనియాడారు. కేంద్ర ఆర్థిక మంత్రిగా ఉన్న మన్మోహన్ సింగ్ చేసిన సేవలు దేశం ఎప్పటికి మరిచిపోదన్నారు. నిజాయితీ, మంచితనం సమర్థవంతంగా పని చేశారని, ఆర్థిక సంస్కరణలతో దేశాన్ని ప్రపంచంలోనే ఆర్థిక శక్తిగా నిలబెట్టిన ఘనుడు అని మాజీ ప్రధాని సేవలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో శివాలయం కమిటీ చైర్మన్ హరికాంత్ చారి, మారుతీ మందిర్ చైర్మన్ గుండెటి శంకర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కౌన్సిలర్ దాము, మండల అధ్యక్షులు నాగేశ్వర్ రావు, తలారి నవీన్, కలీం తదితరులు పాల్గొన్నారు.

సాలూర: సాలూర మండల కేంద్రంలో భారత మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు మందర్నా రవి, సొసైటీ చైర్మన్ అల్లె జనార్ధన్, కాంగ్రెస్ నాయకులు కేజీ గంగారాం, సొక్కం రవి, ఎం.శంకర్, లక్ష్మణ్, గౌస్, దేవురావు తదితరులున్నారు.

మెండోర: భారతదేశాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు నిరంతరం కృషి చేసిన ఆర్థిక సంస్కరణవాది భారత మాజీప్రధాని మన్మోహన్ సింగ్ మరణం ఈ దేశానికి తీరనిలోటని వేల్పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తింటి ముత్యంరెడ్డి అన్నారు. గురువారం రాత్రి మరణించిన మన్మోహన్ సింగ్‌కు మండల కేంద్రంలో పార్టీ ఆధ్వర్యంలో మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి నివాళులు అర్పించి జోహర్లు అర్పించారు. మన్మోహన్‌సింగ్ మృతి దేశానికి కాంగ్రెస్ పార్టీకి తీరనిలోటని, ఆయన తీసుకువచ్చిన ఆర్థిక సంస్కరణలు దేశానికి ఎంతో ఉపయోగపడ్డాయని గుర్తు చేస్తూ మృతి పట్ల సంతాపం ప్రకటించి రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో టౌన్ అధ్యక్షుడు గుండోజి రవి, గంగాధర్, గణేష్, మహేష్, శ్రీనివాస్‌గౌడ్, భూమేష్, చిన్నారెడ్డి, శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

పీవీఆర్ భవన్‌లో..

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని పీవీఆర్ భవన్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. దేశ మంచి ఆర్థికవేత్తను కోల్పోయిందని, ఆయన చేసిన సేవలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ సాయిబాబాగౌడ్, పండిత్ పవన్, అజ్జు, పూల నర్సయ్య, చరణ్‌రెడ్డి, జిమ్మి రవి, విజయ్, చిట్టిరెడ్డి, చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

ఏర్గట్ల: మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద శుక్ర వారం కాంగ్రెస్ నాయకులు మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదేళ్ల సంకీర్ణ ప్రభుత్వాన్ని సమర్థవంతంగా నడిపిన నాయకుడని, సమాచార హక్కు చట్టం, ఆహార భద్రత చట్టం, ఉపాధి హామీ చట్టం వంటి వాటిని అమల్లోకి తెచ్చిన ఘనత ఆయనదేనని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు శివన్నోల్ల శివ కుమార్, పన్నాల నర్సారెడ్డి, ముస్కు మోహన్, దండెవోయిన సాయికుమార్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

మన్మోహన్‌సింగ్ మరణం బాధకరం

వేల్పూర్: మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మరణం బాధకరమని మాజీమంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం వేల్పూర్‌లోని ఆయన నివాసంలో ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతి చెందడం బాధకరమన్నారు. ఈ సందర్భంగా మన్మోహన్‌సింగ్ మరణం తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేశారు. మన్మోహన్‌సింగ్ మరణం దేశానికి తీరని లోటని, ఆయన ఆత్మకు శాంతి కలగాలని దేవున్ని కోరుకుంటున్నానని అన్నారు. తన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి, సంతాపాన్ని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

భారతజాతి గర్వించే ఆర్థిక వృక్షం..

కమ్మర్‌పల్లి: దేశ ఆర్థిక సంస్కర్త భారత జాతి గర్వించే ఆర్థిక వృక్షం దివంగత మాజీప్రధాని మన్మోహన్‌సింగ్ అని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి కొనియాడారు. మన్మోహన్‌సింగ్ మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. శుక్రవారం మండలంలోని మానాల గ్రామంలో మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆయనకు ఘననివాళులు అర్పించారు. స్థానిక గ్రామపంచాయతీ వద్ద కాంగ్రెస్ నాయకులతో కలిసి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక రంగంలో ప్రపంచదేశాలలో మనదేశాన్ని అగ్రగామిగా నిలిపిన మన్మోహన్ సింగ్ మరణం తీరని లోటన్నారు. ఈ కార్యక్ర మంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జలపతి, మానాల గ్రామ కాంగ్రెస్ నాయకులు రమేష్, మోహన్, రవీందర్, హరిదాసు, రాజునాయక్, గురుదాస్, గజంలాల్, బంకట్‌లాల్, భూమయ్య పాల్గొన్నారు.

డొంకేశ్వర్: మాజీప్రధాని డాక్టర్ మన్మోహన్‌సింగ్ మృతి చెందడం పట్ల శుక్రవారం డొంకేశ్వర్ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భూమేష్‌రెడ్డి సంతాపం తెలిపారు. మన్మోహన్‌సింగ్ దేశానికి చేసిన సేవలను కొనియాడుతూ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో పీపీసీఎస్ చైర్మన్ భరత్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ సుమన్, నాగరాజు, శ్రీకాంత్, బాపురావు, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

నంది పేట: మండల కేంద్రంలో మాజీప్రధాని డాక్టర్ మన్మోహన్‌సింగ్ మృతి పట్ల ఘనంగా నివాళులు అర్పించారు. సుమారు పదేళ్ళ పాటు దేశప్రధానిగా భారతదేశానికి సేవలు అందించిన ఆర్థిక వెత్త అనారోగ్యంతో మృతి చెందడంతో స్థానిక కాంగ్రెస్ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా వక్తలు మాట్లాడుతూ మన్మోహన్‌సింగ్ ఆర్థిక మంత్రిగా రిజర్వుబ్యాంకు గవర్నర్‌గా, దేశ ప్రధానిగా అత్యుత్తమ సేవలందించినట్టు కొనియాడారు. అనంతరం రెండు నిమిషాల పాటుల మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మంద మహిపాల్, నిజామాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పెంట ఇంద్రుడు, సీనియర్ నాయకులు పిప్పెర సాయరెడ్డి, వైఎస్.గంగాధర్, దమ్మయి శీను, మాన్పూర్ భూమేష్, సుక్కన్న, జెమిల్, నిఖిల్, తదితరులు పాల్గొన్నారు.


మానాలలో..


ఏర్గట్లలో నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు


నందిపేటలో నివాళ్లు అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఎంవీఐ సుభాష్‌కు సన్మానం


లక్కోరలో ఎంవీఐ సుభాష్‌ను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు

వేల్పూర్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ గజిటెడ్ అసోసియేట్ అధ్యక్షుడిగా ఎన్నికైన ఉట్నూర్ సుభాష్‌ను శుక్రవారం లక్కోరలో శాలువతో సన్మానించారు. తెలంగాణ గజిటెడ్ అధికారులు, కామారెడ్డి జిల్లా నూతన కమిటీని తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్ రావు ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా ఆర్.రవీందర్, అసోసియేట్ అధ్యక్షుడిగా ఉట్నూర్ సుభాష్, ఉపాధ్యక్షుడిగా లింగం, రాజలింగం, సంతోషిణిరెడ్డి, కార్యదర్శిగా సాయిరెడ్డి, ప్రధానకార్యదర్శులుగా నర్సింలు, జ్యోతి, కోశాధికారిగా భూమయ్య, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా డాక్టర్ బి.నిజం, పబ్లిక్ సెక్రెటరీగా డాక్టర్ డి.మౌనిక, ఆఫీస్ సెక్రెటరీగా శ్రీనివాస్‌రెడ్డి, కల్చరర్ సెక్రెటరీగా ప్రశాంత్‌రెడ్డి, స్పోర్ట్స్ అండ్ గేమ్స్ సెక్రెటరీగా డాక్టర్ సుజాత, ఎగ్జిక్యూటీవ్ మెంబర్‌లుగా తౌడ బుద్ధిన్, ఠాకూర్, శశికిరణ్, వనితరెడ్డిలు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మోటర్ వెహికిల్ ఇన్స్‌పెక్టర్ సుభాష్‌ను లక్కోర గ్రామానికి చెందిన బీజేపీ తెలంగాణ రాష్ట్ర ఫిషర్‌మెన్ సెల్ కో కన్వీనర్ బట్టు లక్ష్మణ్, పడిగెల మాజీ సొసైటీ చైర్మన్ దేగాం రాములు, వేల్పూర్ పీఏసీఎస్ వైస్‌చైర్మన్ భైరి శ్రీధర్, డైరెక్టర్‌లు చేపూర్ గంగాధర్, మాజీ వార్డుసభ్యుడు మాడ వేటి ప్రదీప్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

జీపీ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి


ఏర్గట్లలో సమ్మె చేస్తున్న కారోబార్‌లు

ఏర్గట్ల, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న ఉద్యోగ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపిడీవో కార్యాలయం వద్ద మండలంలోని కారోబార్‌లు టోకెన్ సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిబ్బంది బకాయిలు చెల్లించాలని, వేతనాలకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని, జీవో నెం. 60 ప్రకారం వేతనాలు కేటగిరీల వారీగా చెల్లించాలని, కార్మికులందరికి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీజీ కేవీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిలుక మారుతి, మండల అధ్యక్షుడు సాయన్న, కారోబార్‌లు సాయిరాం, హన్మండ్లు, రఫీక్, రాకేష్, జనార్థన్ సిబ్బంది పాల్గొన్నారు.

చీటింగ్ కేసులో ఒకరికి 15 నెలల జైలు

బోధన్‌రూరల్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): చీటింగ్ కేసులో ఒక సంవత్సరం మూడు నెలల జైలుశిక్షతో పాటు రెండు వేల రూపాయల జరిమాన కోర్టు న్యాయమూర్తి విధించారని బోధన్ పట్టణ సీఐ వెంకటనారాయణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం 2013వ సంవత్సరంలో ఆవుల జగన్మోహన్ రావు, ఆవుల జీవన్ బాబు చీటింగ్ చేశారని శుక్రవారం బోధన్ కోర్టులో విచారణ జరుపగా వారికి ఒక సంవత్సరం మూడు నెలల జైలుశిక్షతో పాటు రెండు వేల రూపాయల జరిమాన విధించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కోర్టు న్యాయమూర్తి పూజిత, సీఐ వెంకట నారాయణ, కిషన్, కోర్టు సిబ్బంది సృజన్, లక్ష్మణ్‌లతో తదితరులు పాల్గొన్నారు. వీరిని సీపీ అభినందించారని తెలిపారు.

చెరుకు రైతుల సమావేశం వాయిదా

బోధన్‌రూరల్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎడపల్లి మండల కేంద్రంలోని సరయు ఫంక్షన్ హాల్‌లో నేడు ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించనున్న రైతుల సమావేశం వాయిదా వేయడం జరిగిందని టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్ తెలిపారు. దేశ మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి చెందడంతో సంతాప దినాలలో భాగంగా ఈ సమావేశాన్ని వాయిదా వేయడం జరిగిందన్నారు. తదుపరి సమావేశం తేదిని ఎమ్మెల్యే తెలియజేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఎడపల్లి మండల అధ్యక్షులు పులి శ్రీనివాస్, బోధన్, సాలూర అధ్యక్షులు నాగేశ్వర్ రావు, మందర్నా రవి తదితరులున్నారు.

ఘనంగా సాయి చప్పన్‌బోగ్


ముప్కాల్‌లో పడిలేచిన మర్రిచెట్టు ఆలయంలో 108 రకాల నైవేద్యాలు సమర్పించిన దృశ్యం

ముప్కాల్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో పడిలేచిన మర్రిచెట్టు సన్నిధానంలో ఐదు రోజులుగా నిర్వహిస్తున్న సాయి పారాయణంలో శుక్రవారం చప్పన్‌బోగ్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ మహా నైవేద్యం కార్యక్రమంలో స్వామివారికి 108రకాల తీపి పదార్థాలతో సమర్పించారు. ఈ కార్యక్రమంలో సాయి పారాయణం మహా శోభయాత్రలో ముగుస్తుందని సాయి సేవా సమితి సభ్యులు తెలిపారు.

విలీన సభను విజయవంతం చేయాలి

సాలూర, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే రెండు న్యూ డెమోక్రసీ పార్టీల విలీన సభను విజయవంతం చేయాలని న్యూడెమోక్రసీ డివిజన్ సహాయ కార్యదర్శి గౌతం కుమార్ అన్నారు. శుక్రవారం బోధన్ పట్టణంలో రెండు విప్లవ పార్టీల విలీనం సభ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో కమ్యూనిస్టు విప్లవకారులు ప్రజల తరఫున ముందు నుంచే పోరాడుతున్నారన్నారు. బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం కమ్యూనిస్టులు అనేక పోరాటాలను చేసి ప్రజలను చైతన్య వంతం చేశారన్నారు. విప్లవకారుల ఐక్యత రెండు న్యూడెమోక్రసీ పార్టీల విలీన సభ ఈ నెల 28న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించడబడుతుందన్నారు. కార్మికులు, కర్షకులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిన్న పర్వయ్య, సూర్య విఠల్, దాల్‌మల్కు పోశెట్టి, నాయకులు సుధాకర్, జయరాం, అన్వర్, అఫ్రిద్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.


బోధన్‌లో వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ దృశ్యం

ప్రముఖ సామాజిక వేత్త సీనియర్ జర్నలిస్టు సంగన్నకు స్వర్ణ నంది పురస్కారం అందజేత


హైదరాబాద్‌లో స్వర్ణ నంది పురస్కారం అందుకుంటున్న బాన్సువాడకు చెందిన సామాజిక వేత్త

బాన్సువాడ, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కళా నిలయం సాంస్కృతిక సంఘ సేవా సంస్థ, ఆధ్వర్యంలో గురువారం రాత్రి తెలంగాణ సారస్వత పరిషత్ హైదరాబాద్ నిర్వహిం చిన కార్యక్రమ వేదికపై వివిధ రంగాలలో ముగ్గురికి స్వర్ణ నంది పురస్కారాన్ని అందజేశారు. బాన్సువాడకు చెందిన సామాజిక వేత్త సీనియర్ జర్నలిస్ట్ సంగన్నకు స్వర్ణ నంది పురస్కార అవార్డును బీసీ కమిషన్ పూర్వ చైర్మన్ వకులాభరణం కృష్ణ మోహన్ రావ్, సభాధ్యక్షుడు కాచం సత్యనారాయణ గుప్త , గౌరవ అతిథి సుంకర సత్యారాయణ పూర్వ డీసీపీ కరకమలములచే స్వర్ణ నంది పురస్కారాన్ని అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా కళా నిలయం సాంస్కృతిక సంఘ సేవా సంస్థ వ్యవస్థాపకులు ఎ.సురేం దర్ మాట్లాడుతూ సీనియర్ జర్నలిస్ట్ ప్రముఖ సామాజిక వేత్త బండ సంగన్నకు వారి సేవలకు గుర్తింపుగా స్వర్ణ నంది పురస్కారం అందజేయడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా బండ సంగారెడ్డి మా ట్లాడుతూ తన సేవలను గుర్తించి స్వర్ణ నంది పురస్కారానికి తమను ఎంపిక చేసిన సంస్థ ప్రతినిధులకు కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలియజేశారు. ఈ పురస్కారం తమపై మరింత బాధ్యతను పెంచింది అన్నారు. ఈ కార్యక్రమంలో ఎ. పుష్పలత సురేందర్ కళానిలయం వ్యవస్థాప కులు, సేవ్ ఎర్త్ ఫౌండేషన్ ఫౌండర్ చైర్మన్ డాక్టర్ టి.సురేందర్, స్వర్ణ నంది పురస్కార గ్రహీతలు కవయిత్రి దొంతు ప్రభావతి, శ్రీమాన్ శ్రీ తిరువాయిపేట పురుషోత్తమ్ అయ్యాళ్వార్, డాక్టర్ చింతపట్ల వెంకటచారి తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ ఫౌండర్ ప్రసిడెంట్, కేసీఆర్ చిత్ర యూనిట్ సభ్యులు, ప్రముఖ నాట్య గురువు జాహ్నవిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ


లబ్దిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

భీమ్‌గల్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టణ కేంద్రానికి చెందిన పలువురు బాధితులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను శుక్రవారం కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు. 16మంది లబ్దిదారులకు బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌కుమార్ ప్రభుత్వం నుంచి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను మంజూరు చేయించినందున బాధిత కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ, మండల అధ్యక్షులు జెజె నర్సయ్య, పర్స అనంత్‌రావు, మల్లెల లక్ష్మణ్, వాక మహేష్, సుంకరి సురేష్, సీహెచ్ గంగాధర్, బోర్‌లింగం, సాయిబాబా, తోట సతీష్, జి.పాన్, ధనుష్, గంగమ్, నరేష్, మొండి దినేష్, భూమేష్, తదితరులు పాల్గొన్నారు.

మిమిక్రీలో రాణిస్తున్న ఆనంద్



- రాష్ట్రవ్యాప్తంగా 4వేలకు పైగా ప్రదర్శనలు
- ఆర్మూర్ ఖ్యాతిని చాటుతున్న మిమిక్రీ కళాకారుడు
- నేడు ప్రపంచ మిమిక్రీ దినోత్సవం



ఎస్పీ, కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్నఆనంద్ (ఫైల్), మాజీజడ్పీచైర్మన్ విఠల్‌రావు చేతుల మీదుగా ఆనంద్‌కు సన్మానం (ఫైల్)

ఆర్మూర్‌రూరల్, డిసెంబరు27(ఆంధ్రజ్యోతి): సినీ నటులు, రాజకీయ నాయకులు, ప్రముఖుల గొంతులను అనుకరిస్తూ ఆహుతులను మంత్రముగ్ధులను చేయడంలో మిమిక్రి కళాకారుడు బోండ్ల ఆనంద్ దిట్ట. ధ్వని అనుకరణ, జంతువులు, పక్షుల ఆరుపులను అనుకరించి ఆయన చేస్తున్న మిమిక్రీ ద్వారా అందరి మన్ననలు పొందుతున్నారు. ఆనంద్ ఇప్పటి వరకు సుమారు 4వేలకు పైగా ప్రదర్శనలు ఇచ్చి పలువురి ప్రశంసలు అందుకున్నారు. మిమిక్రీ సాధనపై ప్రత్యేక దృష్టి సారించి ప్రముఖ ఇంద్రజాలికులు జాదు యుగంధర్, రంగనాథ్‌ల వద్ద శిక్షణ పొందారు. గత 13ఏళ్లుగా సొంతంగా ప్రదర్శనలు ఇస్తూ గుర్తింపు పొందారు. జిల్లాలోనే కాకుండా ఇతర జిల్లాలో ప్రదర్శనలు ఇస్తూ ప్రముఖుల ప్రశంసలు అందుకున్నారు. ఏకధాటిగా అనేక గొంతులను అవలీలగా అనుకరిస్తూ ప్రజల మెప్పుపొందుతున్నారు.

ప్రభుత్వ పథకాలపై ప్రచారం,,,

మిమిక్రీ ప్రదర్శనతో పాటు మూఢనమ్మకాలు, అందరికి విద్య, పరిసరాల పరిశుభ్రత, రోడ్డు ప్రమాదాల నివారణ, తదితర అంశాలపై ప్రజలను చైతన్య ఎరుస్తున్నారు. ఆర్మూర్‌లో నిర్వహించే దసరా ఉత్సవాలలో ప్రతీఏటా ఆనంద్ మిమిక్రీ ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది.

కళామ్మతల్లికి సేవ చేయడం నా అదృష్టం..

● **బోండ్ల ఆనంద్**

కళామతల్లికి సేవ చేయడం అదృష్టంగా భావిస్తున్నాను. మిమిక్రీ ద్వారా అన్నివర్గాల ప్రజలను సంతోష పర్చడం పట్ల ఆనందంగా ఉంది. సామాజిక చైతన్యానికి నా వంతు ప్రయత్నం, కృషి చేస్తున్నాను. నన్ను ప్రోత్సహిస్తూ వస్తున్న గురువులు, అధికారులు, ప్రజలకు ధన్యవాదాలు.

పురస్కారాలు......



- 2015సంవత్సరానికి గాను ప్రపంచ ప్రఖ్యాత మిమిక్రీ కళాకారుడు నేరేళ్ళ వేణుమాదవ్ పురస్కారంతో పాటు నగదు ప్రోత్సహకాన్ని అప్పటి కలెక్టర్ రోనాల్డ్ రాస్ చేతుల మీదుగా అందుకున్నారు.
- అప్పటి కలెక్టర్‌లు అశోక్‌కుమార్, రామంజనేయులు, ప్రద్యుమ్నా, రోనాల్డ్ రోస్, యోగితరాణా, నారాయణరెడ్డి, ఎస్పీలు రవిశంకర్, తరుణ్‌జోషి, చంద్రశేఖర్‌రెడ్డి, సీపీ కార్తికేయల చేతుల మీదుగా అవార్డులు ప్రశంసాపత్రాలు పొందారు.
- 2016లో కావ్య విద్యవిషయాక సమాఖ్య ఇందూర్ వారు మిమిక్రీ స్టార్ బిరుదును ప్రధానం చేశారు.
- 2017లో తెలంగాణ రాష్ట్ర జానపద కళాకారుల సంఘం ద్వారా మిమిక్రీ కళారత్న అవార్డును అందుకున్నారు.
- 2020-21లో తెలుగు వెలుగు సమాఖ్య, 2001-22లో జీఆర్ మెమోరియల్‌హాల్ వెల్ఫేర్‌సొసైటీ ఆధ్వర్యంలో సన్మానాలు పొందారు.

అంగరంగ వైభవంగా అయ్యప్ప మహాపడిపూజ



బాన్సువాడ అయ్యప్ప స్వామి ఆభరణాలు, నృత్యాలు చేస్తూ తీసుకువస్తున్న స్వాములు



అయ్యప్ప స్వామి పడిపూజలో మాట్లాడుతున్న ప్రభుత్వ సలహాదారులు పోచారం

బాన్సువాడ, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): బాన్సువాడ పట్టణంలో శ్రీ అయ్యప్ప స్వామి పడిపూజ గురువారం రాత్రి ఎంతో అంగరంగా వైభవంగా, కన్నులపండగగా పడిపూజ కార్యక్రమం జరిగింది. మొదటగా బాన్సువాడ పెద్ద హనుమాన్ మందిర్ నుంచి నగల ఊరేగింపు అయ్యప్ప స్వాముల శరణు ఘోష మధ్య అయ్యప్ప పడిపూజ వద్దకు తీసుకువచ్చారు. జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఈ అయ్యప్ప మహా పడిపూజకు పెద్దఎత్తున భక్తులు తరలివచ్చారు. భక్తుల మధ్యన స్వామివారికి ఇష్టమైన అభిషేకాలు జరిగాయి. మహాపడిపూజలో పిట్ల కృష్ణ మహారాజ్ ప్రవచనం భక్తులను ఆకట్టుకుంది. రాష్ట్ర వ్యవసాయ శాఖ సలహాదారులు శాసనసభ్యులు పోచారం శ్రీనివాస్ రెడ్డి , మాజీ ఎంపీ బీబీపాటిల్, మాజీ ఎంపీ. మాజీ శాసనసభ్యులు లక్ష్మీనారాయణ, సరస్వతి మాతఆలయ ధర్మకర్త పోచారం శంభురెడ్డి, జుక్కల్ మాజీశాసన సభ్యులు సౌధాగర్ గంగారం, ఇంకా వీఐపీలు చాలా పెద్దఎత్తున భక్తులు వివిధ గ్రామాల నుంచి గురుస్వాములు, స్వాములు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఎంతో వైభవంగా ఎంతో కనుల పం డుగగా సువర్ణ మందిరంగా మండపాన్ని ఏర్పాటు చేశారు. సాయంత్రం ఆరుగంటలకు గణపతి హోమంతో ప్రారంభమైన అయ్యప్ప మహాపడిపూజ రాత్రి 11.30 గంటల వరకు పూజా, భజనతో భక్తులు పులకించిపోయారు. రాత్రి స్వామివారికి కన్నుల పండుగగా అలంకరణ చేసినారు. ఆర్తి మంత్రపుష్పంతో కార్యక్రమం ముగించారు. పాదయాత్ర చేసిన స్వాములకు, రుషితుల్య స్వాములకు ఘనంగా సన్మానించారు. బాన్సువాడ అయ్యప్ప స్వాములే కాకుండా, మద్నూర్, బిచ్కుంద, బీర్కూర్, కోటగిరి, రుద్రూర్, వర్ని, నసురుల్లాబాద్, పిట్లం, ఎల్లారెడ్డి, గాంధారి మండలాల నుంచి పెద్దఎత్తున అయ్యప్ప మాలధారణం ధరించిన సాములు ఈ మహా పడిపూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. పాదయాత్ర గురుస్వామి వినయ్ గురుస్వామి, శంకర్ గురుస్వామి, భాస్కర్ గురుస్వామి తదితర స్వాముల ఆధ్వర్యంలో మహా పడిపూజ కార్యక్రమం నేత్రపర్వంగా సాగింది.

సీఎం కప్ రాష్ట్రస్థాయి క్రీడలకు పోచంపాడ్ విద్యార్థులు



సీఎం కప్ పోటీలకు ఎంపికైన పోచంపాడ్ విద్యార్థులు

మెండోర, డిసెంబరు27(ఆంధ్రజ్యోతి): సీఎం కప్ రాష్ట్రస్థాయి క్రీడలకు పోచంపాడ్ బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం సురేందర్, పీఈటీ సంజీవ్ తెలిపారు. ఈ సందర్భంగా హైదరాబాద్ సరూర్‌నగర ఇండోర్ స్టేడియంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో బాలాజీ లింబాద్రి, శాసరత్ బార్గవ, రాము, అనిష్, అఖిల్‌లు ఎంపికయ్యారని, వీరిని పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు అభినందనలు తెలిపారు. జిల్లా జట్టుకు కోచ్‌గా వ్యవహరిస్తున్న సంజీవ్‌ను పలువురు అభినందించారు.

అర్గుల్‌లో పంట సాగు పరిశీలన



పంట సాగును పరిశీలిస్తున్న వరంగల్ జిల్లా రైతులు

జక్రాన్‌పల్లి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అర్గుల్ గ్రామంలో జక్రాన్‌పల్లి ఉమెన్స్ ఫార్మర్ ప్రొడ్యూసర్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఆదర్శ రైతు మధుసూదన్‌రెడ్డి వ్యవసాయ క్షేత్రాన్ని ఉమ్మడి వరంగల్ జిల్లా రైతుల్లు సందర్శించారు. అనంతరం రైతులు వ్యవసాయ క్షేత్రంలో ఆదర్శ రైతు మధుసుదన్ సాగు చేస్తున్న ఆయిల్ పంట సాగుతో పాటు ఇతర పంటలైన అంతర్ పంటలుగా సాగుతున్న జొన్న, పసుపు పంటను రైతులు పరిశీలించారు ఈ పంటల సాగులో రైతు రసాయన ఎరువులు వాడకుండా సేంద్రీయ ఎరువులను వాడుతున్నారని, ఆయిల్‌పాం పంటల సాగుతో పాటు ఇతర పంటలు జొన్న, పసుపు పంటను సాగు చేస్తున్నారని ఉమ్మడి వరంగల్ జిల్లా రైతులు వివరిస్తూ అవగాహన కల్పించారు. పంటల సాగులో మేళకువలు, సాగు పద్దతి, మోతాదుకు మించి ఎరువులు వాడవద్దని, సరిపోయేంత ఎరువులు పంటలకు వాడుతూ పంటలు సాగు చేస్తే అధిక దిగుబడి వస్తుందని రైతు వివరించారు. ఇదే సాగు పద్ధతిలో తాము కూడా వివిధ పంటలను సాగు చేసుకుంటామని ఉమ్మడి వరంగల్ జిల్లా రైతులు తెలిపారు. కార్యక్రమంలో ఆదర్శ రైతులు చిన్నారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, ఉమ్మడి వరంగల్ జిల్లా గద్వాల ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ కో-ఆర్డినేటర్ శ్రీనివాస్, ఎంబిఎస్ కో-ఆర్డినేటర్ రమేష్, 50మంది ఉమ్మడి రవంగల్ జిల్లా రైతులు, అర్గుల్ రైతులు పాల్గొన్నారు. .

క్రీడాకారులను అభినందించిన ప్రిన్సిపాల్



జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ నళిని

డిచ్‌పల్లి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): జమ్ముకాశ్మీర్ లో జరిగిన జాతీయ స్థాయి సాఫ్ట్ బాల్ పోటీల్లో బంగారు పతకాలు సాధించి తెలంగాణ రాష్ట్ర జట్టు ప్రథమ స్థానంలో నిలిపేందుకు కీలక పాత్ర పోషించిన క్రీడకారులను ప్రిన్సిపాల్ నళిని శుక్రవారం పాఠశాలలో శాలువలు క ప్పి సన్మానించారు. మండలంలోని సుద్దపల్లి గురుకుల పాఠశాల విద్యార్థులు బంగారు పతకాలు అందుకొని రావడంతో క్రీడకారులను అభినందించి మరిన్ని పతకాలు సాధించేల తోడ్పాడు అందించలన్నారు. ఈ కార్యక్రమంలో కోచ్ మౌనిక, వైస్ ప్రిన్సిపాల్ స్వప్న, వ నిత, వ్యాయమ ఉపాధ్యాయులు జ్యోత్స్న, శ్రీలత, పాల్గొన్నారు.

ఘనంగా ఆరట్టు మహోత్సవం



లింగంపేట్‌లో అయ్యప్ప స్వామి శోభాయాత్రలో భక్తులు

లింగంపేట, డిసెంబర్ 27 (ఆంధ్రజ్యోతి) : లింగంపేట మండల కేంద్రంలో శుక్రవారం అయ్యప్ప ఆరట్టు మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. స్వామి వారి ఉత్సవ విగ్రహానికి తిరు అభరణాలను ధరించి శోభాయాత్ర నిర్వహించారు. భక్తి శ్రద్ధలతో మండల కేంద్రంలోని ప్రధాన వీధుల గుండా భక్తి పాటలతో ఆడుతూ పాడుతూ భక్తులు శోభాయాత్ర నిర్వహించారు. స్వామివారికి ఇంటింట మంగళహారతులతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం స్వామివారికి చక్రస్నానం చేయించారు. కార్యక్రమంలో భక్తులు చంద్రమౌళి, రవి గౌడ్, శ్రీకాంత్, సిద్దాగౌడ్, లింగాగౌడ్, నగేష్, లక్ష్మీనారాయణ, సత్యనారాయణలతో పాటు మండలంలోని అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.

విద్యావైజ్ఞానిక మహాసభలను జయప్రదం చేయాలి



గోడప్రతులను ఆవిష్కరించిన ఎంఈవో,నాయకులు

కామారెడ్డిటౌన్,డిసెంబరు 27(ఆం ధ్రజ్యోతి): నల్లగొండ జిల్లాలో ఈనెల 28 నుంచి 30 వరకు టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో జరిగే రాష్ట్ర విద్యా వైజ్ఞానిక మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా అధ్యక్షుడు ఆకుల బాబు తెలిపారు. శుక్ర వారం కామారెడ్డి ఎంఈవో ఎల్లయ్య చేతుల మీదుగా గోడ ప్రతులను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యావైజ్ఞానిక మహాసభలలో అధ్యాపనం సామాజిక స్పృహ లక్ష్యం, హక్కులు బాధ్యతలు తదితర అంశాలపైచర్చ ఉంటుందని తెలిపారు. పెద్ద ఎత్తున ఉపాధ్యాయులందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు నరసింహరావు,రూప్‌సింగ్, సాయిగౌడ్, బాలయ్య, నాంపల్లి,శ్రీహరి,నరేందర్,రత్నం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం కప్ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభం





తలబడుతున్న మహబూబ్‌నగర్, ఆదిలాబాద్ మహిళ జట్లు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లా క్రీడాశాఖ ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్‌లోని స్టేడియంలో నిర్వహిస్తున్న 'సీఎం కప్' రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభమయ్యాయి. శుక్రవారం ఇండోర్ స్టేడియంలో పోటీలను డీవైఎస్‌వో శ్రీనివాస్ ప్రారంభించారు. ముందుగా భారత మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్‌సింగ్ మృతికి సంతాపంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. టోర్నీకి 33 జిల్లాల నుంచి 850 మంది క్రీడాకారులు హాజరయ్యారు. కార్యక్రమంలో ఒలింపిక్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కురుమూర్తిగౌడ్, వ్యాయామ ఉపాధ్యాయులు జగన్‌మోహన్‌గౌడ్, విలియం, వేణుగోపాల్, బాల్‌రాజ్, నిరంజన్‌యాదవ్, రిటైర్డ్ పీడీ చెన్నవీరయ్య, శ్రీనివాసులు, సీనియర్ అసిస్టెంట్ రవీందర్‌రెడ్డి, విజయ్‌కుమార్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

శుభారంభం చేసిన మహబూబ్‌నగర్ మహిళా జట్టు

మహిళా విభాగంలో మహబూబ్‌నగర్ మహిళా జట్టు శుభారంభం చేసింది. మహబూబ్‌నగర్ జట్టు ఆదిలాలబాద్‌పై 57-09 స్కోర్ తేడాతో గెలిచింది. నల్గొండ జట్టు నిజామాబాద్‌పై 70-18, రం గారెడ్డి జట్టు సిద్ధిపేటపై 50-07, హైదరాబాద్ జట్టు నారాయణపేటపై 49-18, మహబూబాబాద్ జట్టు ఖమ్మంపై 30-26, సంగారెడ్డి జట్టు పెద్దపల్లిపై 50-10, నాగర్‌కర్నూల్ జట్టు మెదక్‌పై 41-10, మెడ్చల్ జట్టు కామారెడ్డిపై 41-04 స్కోర్ తేడాతో గెలుపొందాయి.

పురుషుల విభాగంలో....

పురుషుల విభాగంలో జరిగిన మ్యాచ్‌లో నాగర్‌కర్నూల్, వనపర్తి, గద్వాల జట్లు శుభారంభం చేశాయి. నాగర్‌కర్నూల్ జట్టు జగిత్యాలపై 28-17, వనపర్తి జట్టు మహబూబ్‌నగర్‌పై 38-10, గద్వాల జట్టు నిర్మల్‌పై 44-15 స్కోర్ తేడాతో గెలుపొందాయి. రంగారెడ్డి జట్టు మెడ్చల్‌పై 45-32, కొత్తగూడెం జట్టు సూర్యాపేటపై 23-16, నల్గొండ జట్టు సిరిసిల్లపై 35-15, హైదరాబాద్ జట్టు కామారెడ్డిపై 41-15, కరీంనగర్ జట్టు వరంగల్‌పై 27-11, ములుగు జట్టు మెదక్‌పై 48-26, నిజామాబాద్ జట్టు భూపాలపల్లిపై 24-15 స్కోర్ తేడాతో గెలిచాయి.





తలబడుతున్న నల్గొండ, నిజామాబాద్ మహిళా జట్లు


నిరాహార దీక్షలో కూర్చున్న ధర్మసమాజ్ పార్టీ నాయకులు

ఉచిత విద్య, వైద్యం సాధనకు ఆమరణ నిరాహార దీక్ష

కామారెడ్డి టౌన్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): ఉచిత విద్య, వైద్యం, ఉపాధి, భూమి, ఇల్లు సాధనకు ధర్మ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో ఆమరణ నిరాహార దీక్ష చేపడుతున్నట్లు రాష్ట్ర నాయకుడు లక్ష్మణ్, జిల్లా నాయకుడు రాజులు తెలిపారు. ప్రజలందరికీ న్యాయమైన డిమాండ్‌లు అందాలని ఈ దీక్ష చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ బోలేశ్వర్, కోకన్వీనర్ అరవింద్, జిల్లా నాయకులు గంగరాజు, రాజు, కవిన్, శివరామకృష్ణ, సత్యం, శ్యామ్, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.


ఎస్ఎస్ఏ ఉద్యోగులకు మద్దతు పలుకుతున్న పీఎస్‌హెచ్ఎంఏ ప్రతినిధులు

కేజీబీవీలకు డిప్యూటేషన్లను రద్దు చేయాలి

కామారెడ్డి టౌన్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): సమ్మె చేస్తున్న కేజీబీవీ ఉపాధ్యాయుల స్థానంలో ప్రభుత్వ ఉపాధ్యాయుల డిప్యూటేషన్లను రద్దు చేయాలని తెలంగాణ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమేష్ కుమార్‌గౌడ్, పందిరి రాజేష్ అన్నారు. ఎస్ఎస్ఏ ఉద్యోగులకు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రమ దోపిడీకి గురవుతున్నారన్నారు. ఎస్ ఎస్ఏ ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం వారు పని చేస్తున్న మూల వేతనం ఇచ్చి వారిని ఉద్యోగంలో రెగ్యులరైజ్ చేయాలని అన్నారు.


దోమకొండలో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

దోమకొండలో బీజేపీ బైక్ ర్యాలీ

దోమకొండ, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఛత్రపతి శివాజీ విగ్రహం వద్ద నుంచి ప్రధాన వీధుల మీదుగా శుక్రవారం బీజేపీ మండలాధ్యక్షుడు మద్దూరి భూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. పార్టీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. అనంతరం బూత్ అధ్యక్షులను ఎన్నుకున్నారు. 93వ బూత్ అధ్యక్షుడిగా నీల అరుణ్ కుమార్, 94వ బూత్‌కు కొండల్‌రెడ్డి, 95వ బూత్‌కు నాయిని క్రిష్టారెడ్డి, 96వ బూత్‌కు మామిండ్ల నవీన్, 97వ బూత్‌కు నరేష్, 98వ బూత్‌కు వేణు, 99వ బూత్‌కు యశ్వంత్‌గౌడ్, 100వ బూత్‌కు ప్రభాకర్, 101వ బూత్‌కు నర్సింలు, 102వ బూత్‌కు రవీందర్‌రెడ్డి, 103వ బూత్‌కు అంజలి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో మెజార్టీగా గెలుపొందాలన్నారు. కార్యక్రమంలో కుంట లక్ష్మారెడ్డి, విపుల్‌జైన్, సీనియర్ నాయకులు చింతల రాజేష్, నరేందర్‌రెడ్డి, కాశిరెడ్డి, విఠల్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, కంది మనోజ్ కుమార్, అనుపాటి నరేందర్‌రెడ్డి, శ్రీనాథ్, జగదీశ్ పాల్గొన్నారు.

సరస్వతీ ఆలయంలో అమ్మవారి పూజలు

బాన్సువాడ టౌన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని శ్రీ విద్యాజ్ఞాన సరస్వతీ దేవి ఆలయంలో శుక్రవారం భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఉదయం నుంచి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. భక్తులు సమర్పించిన నూతన వస్త్రాలతో అమ్మవారిని అలంకరించారు. సాయంత్రం దీక్షా స్వామి జీడిపల్లి రమేష్‌గౌడ్ సరస్వతీ మాతా ఉత్సవ విగ్రహానికి పంచామృతాభిషేకం చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. విచ్చేసిన భక్తులు కోసం అల్పాహారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మాలాధారణ స్వాములు, భక్తులు తదితరులున్నారు.

అయ్యప్ప నిత్యాన్న సేవా ప్రసాద ట్రస్ట్‌కు విరాళం


అయ్యప్ప నిత్యాన్న ప్రసాద సేవా ట్రస్ట్‌కు విరాళం అందజేస్తున్న దృశ్యం

బాన్సువాడ టౌన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : అయ్యప్ప నిత్యాన్న ప్రసాద సేవా ట్రస్ట్‌కు బాన్సువాడకు చెందిన ప్రముఖ వైద్యుడు రఘు తేజ రూ.లక్షా 11వేల 116లను విరాళంగా అందజేశారు. ఇట్టి విరాళాన్ని బాన్సువాడ అయ్యప్ప వ్యవస్థాపక గురుస్వామి బెజుగం శంకర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తులు నిత్యాన్న ప్రసాద వితరణ కోసం విరాళాలను అందజేయడం ఆనందంగా ఉందన్నారు. అయ్యప్ప స్వామి దాతలను, భక్తులందరిని అనుగ్రహించాలని వేడుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్వాములు తదితరులున్నారు.


దోమకొండలో మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి నివాళ్లు అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు


భిక్కనూరులో..


సదాశివనగర్‌లో..

మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ సేవలు ఎనలేనివి

పిట్లం/లింగంపేట/భిక్కనూరు/దోమకొండ/గాంధారి/బిచ్కుంద/సదాశివనగర్/బాన్సువాడ/బీర్కూర్/నస్రుల్లాబాద్/నాగిరెడ్డిపేట/రామారెడ్డి: డిసెంబరు 27: భారతదేశ ఆర్థిక సంస్కరణ వేత్త మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మరణం దేశానికి తీరని లోటని కాంగ్రెస్ నేతలు అన్నారు. ఆయన చేసిన సేవలు చిరస్మరణీయంగా ఉంటాయని వారు కొనియాడారు. శుక్రవారం ఆయా జిల్లా, మండల, గ్రామ కాంగ్రెస్ పార్టీ కార్యాలయాల్లో ఆయన ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తూ కుటుంబ సభ్యులకు సంతాపం తెలుపుతూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పిట్లంలో రాంరెడ్డి, హన్మండ్లు, మోహన్‌రెడ్డి, బోడ్ల రాజు, ఇమ్మిరోజ్, చంద్రశేఖర్, బాల్‌రాజ్, ఇమ్రాన్, నాయకులు మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. లింగం పేట మండలంలో పార్టీ అధ్యక్షుడు బుర్ర నారాగౌడ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ జొన్నల రాజు, నాయకులు ప్రసాద్‌గౌడ్, రాంరెడ్డి, నగేష్, కౌడ రవి, అట్టెం శ్రీనివాస్, ఎల్లమయ్య, అశోక్, గోపాల్, పూల్‌సింగ్, లక్ష్మారెడ్డి, నాగరాజులతో పాటు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన నాయకులు ఉన్నారు. భిక్కనూరులో మండల అధ్యక్షుడు భీంరెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రకాంతరెడ్డి, పీసీసీ కార్యదర్శి ఇంద్రకరణ్‌రెడ్డితో పాటు జంగంపల్లితో పాటుగా ఆయా గ్రామాల్లో మన్మోహన్ సింగ్‌కు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నాయకులు ఘనంగా నివాళులు అర్పించారు. దోమకొండలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ తన నివాసంలో మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు నివాళ్లు అర్పించగా, ఆయనతో మండలాధ్యక్షుడు అనంత్‌రెడ్డి, డీసీసీ జనరల్ సెక్రెటరీ తాటిపల్లి శ్రీకాంత్, టౌన్ అధ్యక్షుడు సీతారాం మధు, తదితరులు పాల్గొన్నారు. గాంధారి మండల కేంద్రంలో ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశాన్ని ఆర్థికంగా కొత్తపుంతలు తొక్కించిన వ్యక్తి మన్మోహన్ సింగ్ అని అన్నారు. భారతదేశ వ్యవస్థలో ఎన్నో విప్లవాత్మకమైన నిర్ణయాలు తీసుకున్నారని తెలిపారు. ఆహార భద్రత చట్టం, ఉపాధిహామీ వంటి కీలక నిర్ణయాలు తీసుకుని అమలులోకి తెచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు. బిచ్కుంద కాంగ్రెస్ పార్టీ శ్రేణులు రెండు నిమిషాలు మౌనం పాటించి పూలతో ఘన నివాళ్లు అర్పించారు. రాష్ట్ర పీసీసీ డెలిగేట్ సభ్యుడు విఠల్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గంగాధర్, నాగనాథ్‌పటేల్, సీనియర్ నాయకులు గౌస్,శంకర్,అశోక్, సాయిలు మన్మోహన్ సింగ్ చిత్ర పటానికి నివాళ్లు అర్పించారు. సదాశివనగర్ మండల కేంద్రంలో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జూకం టి సంగారెడ్డి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటూ కాంగ్రెస్ పార్టీ నాయకులు రెండు నిమిషాలు మౌనం పాటించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ సంగ్యానాయక్, సేవాదల్ జిల్లా అధ్యక్షుడు లింగాగౌడ్, ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు మద్దెల బాగయ్య, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ గాదారి శ్రీనివాస్‌రెడ్డి, మండల జనరల్ సెక్రెటరీ చింతల లక్ష్మీపతి, ఎస్సీ విభాగం మండల అధ్యక్షుడు కవిన్, గ్రామ అధ్యక్షుడు చిందం రాజయ్య, సీనియర్ నాయకుడు వడ్ల రాజేందర్ తదితరులు ఆయన చిత్ర పటానికి నివాళ్లు అర్పించారు. బాన్సువాడలో భారతదేశ ఆర్థిక వ్యవస్థను ప్రపంచానికి ఆదర్శంగా నిలిచేలా రూపొందించిన ఘనత భారతదేశ మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ అని ప్రభుత్వ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి కొనియాడారు. శుక్రవారం బాన్సువాడ పట్టణ కేంద్రంలోని తన నివాసంలో ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి డాక్టర్ మన్మోహన్‌సింగ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, మండల అధ్యక్షుడు మోహన్ నాయక్, నాయకులు కృష్ణారెడ్డి, అంజిరెడ్డి, ఎజాజ్, బాబా కాలేక్, అఫ్రోజ్, నార్ల రవీందర్, అలీబిన్, అబ్దుల్లా, హకీం, వాహబ్ తదితరులు ఉన్నారు. బీర్కూర్‌లో ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్‌లు బీర్కూర్ మండల కేంద్రంలోని గాంధీ చౌక్‌లో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి డాక్టర్ మన్మోహన్‌సింగ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు శశికాంత్, సందీప్, సానెపు గంగారాం, యామ రాములు, ఆరీఫ్, రఘు, సాహెబ్‌రావు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. నస్రుల్లాబాద్ మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు సంతాప సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బీర్కూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్యామల, కాంగ్రెస్ పార్టీ నాయకులు పెరిక శ్రీనివాస్, విఠల్, మైషాగౌడ్, ఖలీల్, యూసుఫ్, పవన్, ప్రతాప్, శీను, మండలంలోన్యాయ గ్రామాల కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. నాగిరెడ్డిపేట మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ చిత్రపటానికి మండల కాంగ్రెస్ నాయకులు నివాళులర్పించి సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీధర్ గౌడ్, నాయకులు రాంచంద్రా రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, కిష్టయ్య, షాహెద్ పాష, ఇమాం, నర్సింహారెడ్డి, ఫారూక్, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు. రామారెడ్డి మండల కేంద్రంతో పాటు రెడ్డిపేట్, పోసానిపేట్, అన్నారం, మద్దికుంట, ఉప్పల్వాయి, గిద్ద, ఇసన్నపల్లి, కన్నాపూర్, మోషంపూర్, కొత్త గ్రామ పంచాయతీ గ్రామాలు, తండాల్లో మన్మోహన్ సింగ్ చిత్రపటాలకు పూలమాలవేసి మౌనం పాటించారు.


గాంధారిలో మన్మోహన్ చిత్రపటం వద్ద నివాళ్లు అర్పిస్తున్న ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు, నాయకులు


లింగంపేటలో..


పిట్లంలో..


బాన్సువాడలో..


బీర్కూర్‌లో..


నాగిరెడ్డిపేటలో..


నస్రుల్లాబాద్‌లో..

డబుల్ బెడ్ రూం ఇళ్ల లబ్ధిదారులు కలిసి ఉండాలి

• మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్


బస్వాపూర్‌లో మహిళలతో మాట్లాడుతున్న గంప గోవర్ధన్

భిక్కనూరు, డిసెంబరు 27: డబుల్ బెడ్ రూం ఇళ్ల లబ్ధిదారులు కలిసిమెలిసి ఉండాలని కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ సూచించారు. శుక్రవారం భిక్కనూరు మండలంలోని బస్వాపూర్ గ్రామ శివారులోని డబుల్ బెడ్‌రూం ఇళ్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా నాలుగు బ్లాక్‌లలోని ఇళ్లలోకి వెళ్లి లబ్ధిదారుల క్షేమ సమాచారాలను, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ మేరకు సెప్టిక్ ట్యాంకు ఇబ్బంది ఉందని, నీటి సమస్య ఉందని వారు తెలియజేయగా సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేదల సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేసి పేద కుటుంబాలకు అండగా నిలిచిందన్నారు. అంతకుముందు గంప గోవర్ధన్‌కు లబ్ధిదారులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబ సభ్యులకు పరామర్శ

దోమకొండ : దోమకొండ గ్రామానికి చెందిన కుంచాల సత్యనారాయణ ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ శుక్రవారం సత్యనారాయణ ఇంటికి చేరుకుని నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం నింపారు. ఆయనతో పాటు బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గంగ్ర మధుసూదన్‌రావు, కుంచాల శేఖర్, బొబ్బసాని శంకర్, అంజయ్య తదితరులు ఉన్నారు.

భూమి రిజిస్ట్రేషన్ చేసే వరకు తల్లి అంత్యక్రియల నిలిపివేత

• రామేశ్వరంపల్లిలో ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన

భిక్కనూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : తల్లిదండ్రుల నుంచి వారసత్వంగా వచ్చిన భూమి సమానంగా పంచాలని అప్పటి వరకు కన్నతల్లి అంత్యక్రియలు జరపకుండా నిలిపివేసిన సంఘటన కామారెడ్డి జిల్లా భిక్కనూరు మండలం రామేశ్వర్‌పల్లి గ్రామంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామస్థుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఏనుగు లింగవ్వకు ఇద్దరు కుమారులు ఉన్నారు. చిన్న కుమారుడు అన్నను కాదని ఆస్తి అంతటిని తన పేరుపై చేయించుకున్నాడు. ఈ విషయమై అన్నదమ్ముల మధ్య గొడవలు జరుగుతున్నాయి. అన్నకు ఆస్తిని సమానంగా ఇవ్వాలని ఎవరు చెప్పినా తమ్ముడు ఇన్ని రోజులు ససేమిరా అన్నాడు. గత రెండు రోజుల క్రితం అనారోగ్యంతో బాధపడుతూ తల్లి మరణించింది. ఇదే మంచి అదునుగా భావించిన అన్న, అన్న కుటుంబ సభ్యులు ఆస్తి మొత్తాన్ని సమానంగా పంచి తన పేరున రిజిస్ట్రేషన్ చేసిచ్చేలా తమ్ముడు ఒప్పుకున్నాడు. ఇదే అదునుగా భూమి రిజిస్ట్రేషన్‌కు సంబంధించి శుక్రవారం స్లాట్ కూడా బుక్ చేయగా మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతితో అనుకోకుండా సెలవు రావడంతో రిజిస్ట్రేషన్ శనివారానికి వాయిదా పడింది. రిజిస్ట్రేషన్ అయిన వెంటనే ఫ్రీజర్‌లో ఉంచిన లింగవ్వ మృతదేహానికి అంత్యక్రియలు జరగనున్నాయి. ఆస్తి కోసం కన్న తల్లి అంత్యక్రియలు ఆపడం ఏంటని, ఏమైనా ఉంటే తర్వాత చూసుకోవాలని అంటూ ముక్కున వేలేసుకుంటున్నారు.

ఏటీఎం మార్చివేసి డబ్బులు డ్రా

కామారెడ్డి టౌన్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి పట్టణంలోని ఇందిరానగర్ కాలనీకి చెందిన సిరిసిల్ల రాజును గుర్తు తెలియని వ్యక్తి మోసగించి బ్యాంక్‌లోని డబ్బులను కాజేసినట్లు పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. రాజు సిరిసిల్ల రోడ్డులో ఉన్న ఎస్‌బీఐ ఏటీఎం వద్దకు డబ్బులు డ్రా చేసేందుకు వెళ్లాడు. డబ్బులు రాకపోవడంతో అతని వెనుకాలే ఉన్న గుర్తు తెలియని వ్యక్తి తాను డబ్బులు తీసి ఇస్తానని చెప్పి రాజు వద్ద ఏటీఎంను తీసుకున్నాడు. డబ్బులు డ్రా చేస్తున్నట్లుగా నటించి ఏటీఎం నుంచి డబ్బులు రావడం లేదని రాజుకు తన ఏటీఎం కాకుండా వేరొక ఏటీఎంను ఇవ్వడంతో ఇద్దరు అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఆ తర్వాత కొద్దిసేపటికి రాజు అకౌంట్‌లోంచి రూ.40 వేలు డ్రా అయినట్లుగా మెసేజ్ రావడంతో బ్యాంక్‌కు వెళ్లి ఏటీఎం కార్డును బ్లాక్ చేయించాడు. ఆతర్వాత కామారెడ్డి పట్టణ పోలీసుస్టేషన్‌కు వచ్చి ఫిర్యాదుచేయడంతో కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

కామారెడ్డి టౌన్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): ఆభరణాలు దొంగలించడంతో పాటు హత్యచేసిన నిందితుడికి జిల్లా ప్రధానన్యాయమూర్తి వీఆర్ఆర్ వరప్రసాద్ జీవితఖైదీతో పాటు రూ.20 వేల జరిమానా విధించినట్లు ఎస్పీ సింధూశర్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్లారెడ్డి పోలీసుస్టేషన్‌లో 2022లో ఎల్లారెడ్డికి చెందిన సుజాత అనే మహిళను గంగుల శ్రీనివాస్ అలియాస్ డీజే శ్రీనివాస్ హత్య చేసినట్లుగా గుర్తించి అరెస్ట్ చేయడం జరిగిందని తెలిపారు. సులభంగా డబ్బులు సంపాదించాలని తన ఇంటి పక్కనే ఒంటరిగా ఉన్న శేర్ల సుజాతను చంపి ఆమె మెడలో ఉన్నటువంటి రెండు తులాల పుస్తెలతాడు, ఒక తులం గుండ్లను తీసుకోవాలని పథకం పన్నాడని తెలిపారు. 10 డిసెంబరు 2022న సుజాతను శ్రీనివాస్ హత్య చేసి ఆభరణాలు ఎత్తికెళ్లాడని తెలిపారు. ఈ కేసులో సాక్షులను విచారించిన న్యాయమూర్తి జీవితఖైదుతో పాటు జరిమానా విధించినట్లు ఎస్పీ తెలిపారు.

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి

శాంతి	- రోటి కప్‌డా రోమాన్స్
దర్శన్	- విడుదల పార్ట్-2
ప్రియా 70	- పుష్ప-2
ప్రియా 35	- బచ్చలమల్లి

బాన్సువాడ

మహేశ్వరి	- పుష్ప-2
వెంకటేశ్వర	- మ్యాక్స్

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	120	140	160
వెన్‌కాబ్(కిలో)	:	130	160	190

